'మన లెవెల్‌కి పిల్లలిద్దరినీ పైచదువులు చదివించడం సాధ్యమయ్యే పనేనా?' అన్నాడు విశ్వనాథం భార్యతో.

'పెద్ద చదువులు చదివించకపోతే వాళ్లూ మనలాగా చాలీచాలని జీతంతో, దరిద్రంతో బతకాల్సిందేగా! అమ్మాయి చదువాపి అయినా అబ్బాయిని చదివిద్దాం' అంది పద్మావతి.

విశ్వనాథం ఓ బట్టల కొట్లో గుమాస్తా. అతను సంపాదించేది ఇల్లుగడవడానికి బొటాబొటీగా సరిపోతుంది. అతనేమీ పెద్దగా చదువుకున్నవాడు కాదు. తండ్రి దగ్గరి నుంచి ఆస్తిపాస్తులూ రాలేదు. తల్లిదండ్రులు గతించిపోయారు. దొరికిన చిన్న ఉద్యోగంతో ఎంతో పొదుపుగా కాపురం దిద్దుకుంటూ గడిపేస్తున్నారు ఆ దంపతులు.

వాళ్లకు ఇద్దరు పిల్లలు. వినోద్, సుషమ. పిల్లలిద్దరూ చదువుల్లో చురుగ్గా ఎక్కివస్తున్నారు. అన్ని క్లాసుల్లో మంచి మార్కులు తెచ్చుకొని ఫస్ట్‌క్లాసులో పాసవుతూ వస్తున్నారు.

వినోద్ ఇంటర్మీడియేట్ మంచి మార్కులతో పాసయ్యాడు. ఎంసెట్‌లో కూడా ఏ కోచింగూ లేకపోయినా మంచి ర్యాంకు తెచ్చుకున్నాడు.

'ర్యాంకు మంచిదే వచ్చింది. సరే కానీ ఇంజనీరింగ్ చదివించగలమా మనం?' అన్నాడు విశ్వనాథం. ముందు చేరేటప్పుడే చాలా ఫీజు కట్టాలి. ఆ తర్వాత ప్రతినెలా వేలకువేలు కావాలి. నాకు వచ్చే జీతంలో ఇది సాధ్యమయ్యేదేనా?' అన్నాడు.

'ఏదో రకంగా చదివించక తప్పదుగదా. చదవకపోతే ఏంచేయిద్దామనుకుంటున్నారు. మీలాగానే ఏదో కొట్లో గుమాస్తాగా ఇరికిస్తారా?' అంది పద్మావతి.

'నిజమే. వాణ్ణి చదివించాలని నాకూ వుంది. కానీ డబ్బెక్కడినుంచితేను?' అన్నాడు విశ్వనాథం.

'అప్పోసప్పో చేసి చదివించుకోవాలి గాని, బాగా చదివే కుర్రవాణ్ణి అప్పుడే ఏ దుకాణంలోనో గుమస్తాగా ఇరికించి, వాడి భవిష్యత్తు పాడుచేయడం న్యాయమేనా?' అంది పద్మావతి.

'మళ్లా తీర్చగలిగితేనేగదా అప్పు చేయాలి. నా సంపాదనలో మిగిల్చి అప్పు తీర్చడం కుదుర్తుందా? పైగా పిల్లకూడా ఎక్కొస్తున్నదాయె. దాని చదువుకు గూడా అప్పుచెయ్యాల్సిందే గదా' అన్నాడు విశ్వనాథం.

'ఆడపిల్లకు పైచదువులెందుకు? కొడుకుని చదివించుకుంటే చేతికందివస్తాడు. ఇద్దరికీ పైచదువులంటే ఎట్టా? మన స్తోమత మనం ఆలోచించుకోవాలి గదా' అంది పద్మావతి.

వారి ఆర్థిక పరిస్థితి ఇల్లు గడవడానికి, పిల్లలను గవర్నమెంట్ స్కూళ్లలో మామూలు చదువులు చదివించడానికీ మాత్రమే సరిపోతుంది. వేలకు వేలు పెట్టి పెద్ద పెద్ద చదువులు చదివించే స్తోమత లేదు. అప్పులు చేయగల ధైర్యమూ లేదు.

పద్మావతి చెప్పినట్లు కొడుకు కొడుకే గదా! ఆడపిల్లను ఎలాగూ చదివించేదిలేదు. రెండేండ్లు ఆగితే ఏదో తమకు తగ్గ సంబంధం చూసి పెండ్లి చేసి పంపడమే. కొడుకు చదువు కోసం అప్పు చేసినా, రేపు ఉద్యోగం వచ్చిన తర్వాత వాడే తీర్చుకుంటాడు. ఇలా ఆలోచించి విశ్వనాథం తను పనిచేసే కొట్టు యజమాని దగ్గర అప్పు తెచ్చి వినోద్‌ని ఇంజనీరింగ్‌లో చేర్పాడు. మంచి రేంక్ వచ్చింది కాబట్టి మంచి సబ్జెక్ట్‌లోనే సీటు దొరికింది.

మూడేళ్లు గడిచిపోయాయి. వినోద్ చదువు

లో చురుగ్గానే వస్తున్నాడు. మొదట తీసుకున్న అప్పుగాక మళ్ళీ కొంత అప్పుజేసి ప్రతి నెలా కొడుక్కి పంపుతున్నాడు విశ్వనాథం.

సుషమ కూడా ఇంటర్మీడియేట్ పాస్ అయింది. 'ఎంసెట్‌కు కూర్చుంటా నాన్నా' అంది తండ్రితో.

'కూర్చుంటావు, మంచి రేంకే తెచ్చుకొంటావు. కానీ నిన్ను ఇంజనీరింగ్ చదివించే శక్తి నాకు లేదుగదమ్మా' అన్నాడు తండ్రి.

'చదివినా చదవకపోయినా ఊరికే ఎంట్రన్సు రాస్తా' అన్నది సుషమ.

'ఊరికే రాస్తావు. రేంకు వస్తుంది. అప్పుడు నిన్ను ఇంజనీరింగ్‌లో చేర్చకపోతే మనస్సు కష్టపెట్టుకుంటావు. వద్దులేమ్మా' అన్నాడు తండ్రి.

'అంతంత డబ్బులు పోసి ఆడపిల్లకు పెద్ద చదువులెందుకు? డబ్బు బాగా ఉన్న వాళ్లు ఏమైనా చెయ్యొచ్చుగాని, పులిని చూసి నక్కవాత పెట్టుకుంటే ఎట్లా?' అంది పద్మావతి.

అన్నయ్య చదువు కోసం అప్పోసప్పో చెయ్యాల్సిందేనన్న తల్లి, తన దగ్గరికి వచ్చేసరికి ఇలా అనడం, కేవలం తను ఆడపిల్ల అయినందుకే గదా అనుకుని బాధపడింది సుషమ.


'చదివించింది చాలుగానీ ఇంక సంబంధాలు చూడండి' అంది పద్మావతి భర్తతో.

'ఇంకో నాలుగేళ్ల దాకా పెళ్లి మాటెత్తితే నేనొప్పుకోను' రోషంగా అని వెళ్లిపోయింది సుషమ.

'పెళ్లి చెయ్యడానికి మాత్రం ఇప్పుడు డబ్బెక్కడిది? ఓ రెండేళ్లు ఆగుదాం. అబ్బాయికి చదువు పూర్తయి ఏదైనా ఉద్యోగం వస్తే కొంత వెసులు



ఉగాది సందర్భంగా శ్రీ విజ్ఞాన్ వేదిక, భీమవరం - భీమేశ్వరస్వామి దేవస్థానంలో సాహిత్య రంగానికి ఎంపికచేసిన ప్రసిద్ధ రచయిత్రి యలమర్తి అనూరాధకి ఉగాది పురస్కారం అందజేసారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తోట సీతామహాలక్ష్మి, జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు పి. కనకరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, గోకరాజు రామం తదితరులు పాల్గొన్నారు.




బాటు ఉంటుంది' అన్నాడు విశ్వనాథం.

తల్లిదండ్రులకు చెప్పకుండా ఎంసెట్ ఎంట్రెన్స్ వ్రాసింది సుషమ. ఎంసెట్‌కు ప్రయత్నిస్తున్నదని తెలిసినా, పోనీలే ఎలాగూ చదివించేది లేదు గదా అని వూరుకున్నారు విశ్వనాథం, పద్మావతీ. సుషమను బియస్సీలో చేర్చారు. తర్వాత ఎంసెట్ ఫలితాలు వచ్చాయి. సుషమ వినోద్ కన్నా మంచి రేంక్ తెచ్చుకుంది.

తన రేంక్ కార్డ్‌ని తల్లిదండ్రులకు చూపింది సుషమ. 'మన పరిస్థితులు అర్థంచేసుకో సుషమా. నాకొచ్చే జీతంతో తిండికి జరగడమే గగనంగా వుంది. పైగా అన్నయ్య చదువుకు చేసిన అప్పుకు నెల నెలా వడ్డీ కట్టడమే కష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నిన్ను ఇంజనీరింగ్ చదివించడం నాకు శక్తికి మించిన పని' అన్నాడు కూతురుతో విశ్వనాథం.

సుషమ చాలా ఆశాభంగం పొందింది. మనసు చిన్నబుచ్చుకుంది. తన స్నేహితులు చాలామంది ఇంజనీరింగ్‌లోనో, డాక్టర్ కోర్సులోనో చేరితే, తను మంచి రాంకు సంపాదించీ పైచదువు చదవలేనందుకు బాధపడింది. నాలుగైదు రోజులైన తర్వాత తనను తనే సమాధానపరచుకుంది తమ ఇంటి పరిస్థితులు అర్థంచేసుకుంటూ.

బియస్సీ చదువు కొనసాగిస్తూ, ఏవైనా పోటీ పరీక్షలకు ప్రయత్నిద్దామని ఆలోచిస్తోంది. స్త్రీలకు మామూలుగా ఉండే రిజర్వేషన్ తప్పించి, తనకు మరే రిజర్వేషనూ లేదు. అందుకని బాగా కృషిచేస్తే తప్ప ఉద్యోగం సాధించలేదని తెలుసు.

'నువ్వు ఉద్యోగం, సద్యోగం అని లేనిపోని ఆశలు పెట్టుకోకు. బియస్సీ కాగానే పెళ్లి చేసుకో' అంది పద్మావతి ఓ రోజు. సుషమ ఏమీ మాట్లాడలేదు.

'నిన్నో ఇంటిదాన్ని చేసి మా బాధ్యత తీర్చుకుంటేగానీ మనశ్శాంతి వుండదు' అన్నాడు విశ్వనాథం.

'పైచదువులెట్లాగూ చదవడానికి కుదరక పోయె. ఉద్యోగం చేస్తే ఏమవుతుంది?' అంది సుషమ రోషంగా.

'నిన్ను చదివించగూడదని కాదు గదమ్మా. నాకు శక్తి లేకనే గానీ...' అన్నాడు విశ్వనాథం.

'మరి ఉద్యోగ ప్రయత్నం చేస్తే ఏమిటి?' అంది సుషమ.

'నువ్వు ముందు గ్రాడ్యుయేట్‌వి కావాలి. ఆ తర్వాత ప్రయత్నాలు చెయ్యాలి. ఉద్యోగం దొరకాలి. వీటన్నిటికీ ఎంత కాలం కావాలో ఆలోచించు. ఆలస్యం అయ్యే కొద్దీ కట్నాల రేట్లు కూడా పెరిగిపోతాయి' అన్నాడు విశ్వనాథం.

బియస్సీ ఆఖరి సంవత్సరం చివరికి వచ్చింది సుషమ. చాలా తీవ్రంగా పోటీ పరీక్షలకు ప్రిపేరవుతోంది. పేపర్లలో ఏ ప్రకటన పడినా వాటన్నిటికీ దరఖాస్తు చేస్తోంది. ఇంటర్వ్యూలకు హాజరవుతోంది. పట్టువదలని విక్రమార్కుడి లాగా ప్రయత్నిస్తోంది. పనిలో పనిగా టైపూ, షార్టుహాండూ, కంప్యూటరూ నేర్చుకుంటోంది.

వినోద్ మంచి మార్కులతో ఇంజనీరింగ్ పాసయ్యాడు. 'నాన్నా నేను యం.టెక్. చదువుతా' అన్నాడు వినోద్.

'బి.టెక్. చదివించడానికే నాకు తలప్రాణం తోకకు వచ్చింది. ఇంకా రెండేళ్లు నా వల్ల కాదు. ఏదైనా ఉద్యోగం చూసుకో' అన్నాడు విశ్వనాథం.

'ఒట్టి బి.టెక్. వల్ల ఏమీ ప్రయోజనముండదు. పోస్టుగ్రాడ్యుయేషన్ చెయ్యాల్సిందే' అన్నాడు వినోద్.

'డబ్బు సర్దడం నా చేతగాదు' అన్నాడు విశ్వనాథం.

'నేనేదో ప్రయత్నం చేసుకుంటాలే' అన్నాడు వినోద్.

ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి.లో యం.టెక్.లో చేరాడు వినోద్. రెండు నెలల తర్వాత శలవులు వస్తే ఇంటికి వచ్చాడు. వచ్చిన మర్నాడు తల్లిదండ్రులను కూర్చోబెట్టి 'నేనొక అమ్మాయిని ప్రేమించాను. పెళ్లి చేసుకుందాం అనుకుంటు



శ్రీ ఐతా చంద్రయ్య రచించిన "శ్రీవాసవాంబ" (పురాణేతిహాసిన నవల) ను ఆవిష్కరిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య మసక చెన్నప్ప.

న్నాం' అన్నాడు.

ఆశ్చర్యపోయారు విశ్వనాథం, పద్మావతీ.

'నీకు ఇరవైరెండేళ్లు కూడా లేవు. ముందు చెల్లెలికి పెళ్లి చెయ్యాలిగదా. అప్పుడే నీ పెళ్లే మిటి?' అన్నాడు విశ్వనాథం.

'ఆ అమ్మాయి నా క్లాస్‌మేటు. నాతో పాటు యం.టెక్.లో చేరింది. వాళ్ల నాన్నగారు బాగా వున్నవాళ్లు. ఒక్కతే కూతురు. నన్ను యం.టెక్. కూడా ఆయనే చదివిస్తున్నాడు. పూర్తికాగానే పెళ్లి చేసుకుంటాం' అన్నాడు వినోద్.

అయితే అన్ని ఏర్పాట్లూ చేసుకొని, కేవలం విషయం తమకు తెలపడం కోసం వచ్చాడన్న మాట. తినీ, తినకా అప్పులుచేసి వీడిని చది వించినందుకు కనీసం చెల్లెలి పెళ్లికి కూడా బాధ్యత వహించకుండా తన స్వార్థం తను చూసుకుంటున్నాడు. ఒకతే కూతురంటే, ఇక ఇల్లరికమే. ముసలితనంలో తమ బాగోగులు చూసే అవకాశమూ లేదన్నమాట. విశ్వనాథం దంపతులు క్రుంగిపోయారు. వినోద్ మర్నాడు ఖరగ్‌పూర్ వెళ్లిపోయాడు.

సుషమ బి.యస్సీ. డిస్టింక్షన్‌లో పాస యింది. తన ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ఓ రెండు నెల్ల తర్వాత తల్లిదండ్రుల దగ్గరికి వచ్చి వాళ్లిద్దరి కాళ్లకూ నమస్కారం చేసి, ఒక కవర్ని తండ్రికి అందించింది. ఆశ్చర్యపోతూ కవరులోంచి ఓ కాగితంతీసి చూశాడు విశ్వ నాథం.

'నాకు ఇంగ్లీషు బాగా రాదు గదమ్మా, ఏముందీ కాగితంలో?' అన్నాడు.

'సెంట్రల్ గవర్నమెంట్‌లోని ఓ పెద్ద సంస్థ లో నాకు స్టెనోగా ఉద్యోగం వచ్చింది నాన్నా' అంది సుషమ. పద్మావతీ, విశ్వనాథంలు సంతో షించారు.

కొడుకు తమ మాటకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా తన దారి తాను చూసుకోవడంతో వాడి చదువుకోసం చేసిన అప్పు ఎట్లా తీర్చాలో, కూతురి పెళ్లికి డబ్బు ఎట్లా సర్దుబాటు చేసుకో వాలో తెలియని విశ్వనాథానికి - కూతురికి ఉద్యోగం వచ్చిందంటే ఎంతవరకూ సంతోషిం చాలో అర్థం కాలేదు.

'నాకేమీ వయస్సు మించిపోలేదు. నా పెళ్లి కోసం మీరేమీ దిగులుపడకండి. కనీసం మూడేళ్లదాకా నన్ను ఉద్యోగం చేసుకోనివ్వండి. ముందు నా జీతంతో అప్పులన్నీ తీర్చుకొందాం. ఆ తర్వాతనే పెళ్లి. నేను కట్నమివ్వను. ఉద్యోగం చేస్తున్న నాకు కట్నం కోరని వరుడు రాకపోడు. రెక్కలొగానే తల్లిదండ్రులను వదిలేసి బాధ్యతలు మరిచిపోయే వినోద్ లాంటి వాళ్లేకాదు. కట్నా లు ఆశించని సదాశయాలుగల వ్యక్తులు కూడా లోకంలో వుంటారు. అన్నయ్య అప్పుడే పెళ్లి చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుని వెళ్లియ్యాడే అని బాధపడే మీరు, నన్ను ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పెళ్లిచేసి పంపించెయ్యా లని ఎందుకు చూస్తున్నారు? నేను ఆడపిల్లనైనం దుకేగదా!

'మీ ప్రేమను పంచుకున్న ఆడపిల్ల మీ బాధ్యతలను, మీ అప్పులనూ పంచుకోగూడదా నాన్నా' అంది సుషమ.

విశ్వనాథం కూతుర్ని కౌగిలించుకున్నాడు. ఇంతవరకూ కొడుకంటే ఒక రకమైన అభి ప్రాయం, కూతురంటే మరోరకమైన అభిప్రా యమూ పెంచుకున్న పద్మావతి కూడా కంట్లో తడి మెరుస్తూండగా కూతుర్ని అక్కున చేర్చు కుంది. ●